క్లుప్తంగా

రెడ్డి పేరంటాలమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులు



నాదెండ్ల: జాతీయ రహదారిపై సాతులూరులో కొలువైయున్న రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరటంతో భక్తులు నూతన ఆలయ నిర్మాణానికి నడుంకట్టారు. ముందుగా మహిళలు ఆలయంలో పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అందులో ఉన్న విగ్రహాలను బాలాలయంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ముందుగా అమ్మవారిని కుంకుమ బండితో గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. గుడి నిర్మాణం అనంతరం తిరిగి విగ్రహాల పునః ప్రతిష్ఠ చేయనున్నారు.

వైభవంగా మండల మహోత్సవం



చిలకలూరిపేట: మండలంలోని చినపసుమర్రులో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల మహోత్సవ పూజలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అన్నాభిషేకం, ఉత్తరద్వారా దర్శనం, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి, అష్టాభిషేకం నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో అక్టోబరు 15 నుంచి జనవరి 15 వరకు అయ్యప్ప దీక్షాధారులకు మధ్యాహ్నం సద్ది, సాయంత్రం భిక్ష ఏర్పాటు చేస్తారు. అన్నదాన కార్యక్రమం నిమిత్తం ఆరా ఫౌండేషన్ చైర్మన్ షేక్ మస్తాన్ దేవాలయానికి 100 క్వింటాళ్ల బియ్యం సమర్పించారు. ఆయనకు వేద పండితులు ఆశీస్సులు అందించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శనగవరపు ఉదయ్‌కిరణ్‌శాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్, కార్యదర్శి పి.పాండురంగారావు పాల్గొన్నారు.

ముగిసిన పునరుద్ధాన కార్యక్రమం

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో షిర్డీసాయి సేవాశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న బాబా పునరుద్ధాన కార్యక్రమం ముగిసింది. ఈ నెల 26న ప్రారంభమై చివరిరోజు గురువారం ఉదయం కాగడహారతి, అభిషేకాలు, సుప్రభాత సేవ, సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. బాబాను అలంకరించి పూజలు చేశారు. అన్నదానం చేశారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిక్కిరిసింది. రెండో తరగతి చదువుతున్న శిఖాకొల్లి చార్వి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు యూవీ శివరామయ్య, శిఖాకొల్లి పాపారావు, సభ్యులు సామ్రాజ్యం పర్యవేక్షించారు.

కందిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

డీడీఏ ఎం శివకుమారి

నాదెండ్ల: కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే మంచి దిగుబడులు సాధించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి చెప్పారు. గణపవరంలోని కంది పంటను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభమౌతుందని రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్ముకుంటే క్వింటాకు రూ.7 వేలు మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రస్తుతం కంది సాగులో కాయ ఈగ, ఆకు కుట్టు పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కాయఈగ నివారణకు పిందె దశలో ప్రాఫినోఫాస్ 400 ఎంఎల్, పదిహేను రోజుల తర్వాత థయాక్లోప్రిడ్ 140 ఎంఎల్ చొప్పున యకరకు పిచికారీ చేసుకున్నట్లయితే ఫలితం ఉంటుందన్నారు. ఆకుచుట్టు పురుగు నివారణకు మొగ్గ దశలో వేప సంబంధిత మందులు వినియోగించాలన్నారు. మొగ్గదశలో కాయ కుళ్ళు కనిపించినట్లయితే క్లోరాంట్రిసిఫాల్ 60 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 60 ఎంఎల్ యకరాకు వినియోగించుకోవాలన్నారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో కందిపంటలో అధిక దిగుబడులు

చిలకలూరిపేట: చీడపీడల నివారణతో కందిలో అధికదిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి గ్రామంలో కందిపంటలో యాజమాన్య పద్ధతులు, కందుల కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందిలో ప్రస్తుత పరిస్థితులలో కాయఈగ, ఆకుచుట్టు పురుగు ఆశిస్తాయని వీటి యాజమాన్యం సకాలంలో చేపడితే దిగుబడులకు డోఖా ఉండదని వివరించారు. కాయ ఈగ నివారణకు పిందెదశలో ప్రొఫెనోఫాస్ 400 మిల్లీలీటర్లు, తర్వాత 10 నుంచి 15 రోజులకు థయాక్లోప్రిడ్ 140 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వేల్పూరులో నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

- రూ.9 కోట్ల వ్యయంతో నిర్మాణం
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీ, అప్కాబ్ ఛైర్మన్



ప్రారంభోత్సవానికి సిద్ధమైన కోల్డ్ స్టోరేజ్

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ.8 కోట్లు వ్యయంతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగి కేంద్రం), 1000 మెట్రిక్ టన్నులు గోదాం, నేటి ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య గురువారం తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్ ప్రారంభోత్సవం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో జరుగుతుందన్నారు. 3 వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం కలిగి ఉన్న ఆధునీకరణ యంత్ర పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, అప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, స్థానిక ప్రజాప్రతినిధులు మండల గ్రామ స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అందరు ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని భారీ అన్నదానం కూడ ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఓంగోలు ఆంజనేయులు, మద్దిగుంట్ల ఏడుకొండలు సీఈవో జాలాది నాగప్రసాదు, సొసైటీ సిబ్బంది సతీష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్లు పంపిణీ



బండ్లమోటు పాఠశాలలో మోడల్ పేపర్లను పంపిణీ చేసిన యూటీఎఫ్ నాయకులు



శావల్యాపురంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాత గంగినేని రాఘవ

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు, గుమ్మనంపాడు, బండ్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఉపయుక్తంగా మోడల్ టెస్ట్‌పేపర్స్-2024 తయారు చేయించి దాతల సహకారంతో వినుకొండ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో 2400 పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధపడాలని, పరీక్షలు ఎలా రాయాలని అనే అంశాలపై వివరించారు. మేళ్లవాగు విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు గాండ్ల నాగేంద్రుడు తల్లిదండ్రులు సుబ్బయ్య, చెంచమ్మ జ్ఞాపకార్థం ఉచితంగా అందించడం జరిగిందన్నారు. అలాగే గుమ్మనాపడు పాఠశాలలో విద్యార్థులకు సిమెంటు వ్యాపారి ఇట్లాపురం కాలేషావలి సహకారంతో ఉచితంగా అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు బి.భాస్కర్, పల్నాడు జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు నాగేంద్రుడు, జిల్లా కౌన్సిలర్ సీహెచ్. తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం: దాతలు సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని అన్నారు. గురువారం మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గంగినేని ఫౌండేషన్ వారు తమ వంతు సహాయంగా స్టడీ మెటీరియల్ అందజేయు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగినేని రాఘవ మాట్లాడుతూ విద్యార్థుల చదువు విలువ ఉపాధ్యాయుల గొప్పతనం గురించి వివరించారు. విద్య ప్రతి వ్యక్తి జీవితాన్ని మార్చగలిగిన శక్తి ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, కెవీఆర్ మోహన్ చందు, గోవిందయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి 6 నెలల జైలు, రూ.1.50 లక్షలు జరిమాన విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. రావిపాడు గ్రామానికి చెందిన సుందరరాజు వద్ద సత్తెనపల్లి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బొట్టు శ్రీనివాసరావు 2015లో రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేయటంతో బ్యాంకులో జమ చేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి నిందితుడికి 6 నెలల జైలు, రూ.1.50 లక్షలు ఫిర్యాదు దారునికి చెల్లించాలని తీర్పు చెప్పారు.

లేగదూడపై వీధికుక్కల దాడి

నాదెండ్ల: లేగదూడపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పశుపోషకుడు తూబాటి హనుమంతరావుకు చెందిన గేదెకు ఏడాది వయస్సున్న దూడ ఉంది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఆరు వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటన చూసిన పశుపోషకులు, స్థానికులు ఇరువురు కలిసి కుక్కలను తరిమేసే ప్రయత్నం చేశారు. వీధికుక్కలు వీరిపై కూడా దాడి చేసేందుకు యత్నించాయి. భయభ్రాంతులకు గురై కర్రలతో వెంటపడటంతో పారిపోయాయి. గాయాలైన లేగదూడను గణపవరం పశువైద్యశాలలో వైద్యం చేయించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఆరు నెలల వ్యవధిలో కుక్కల దాడిలో పదుల సంఖ్యలో లేగదూడలు, మేకలు, గొర్రెలు మృతిచెందాయి. రాత్రి వేళల్లో పాదచారులు, వాహనదారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.వసంతబాబు

చిలకలూరిపేటటౌన్: ఓటర్ నమోదు కోసం వచ్చిన అర్జీలను సత్వరమే విచారణ చేసి రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి జి.వసంతబాబు చెప్పారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు వచ్చిన అర్జీలను సత్వరమే పూర్తి చేయాలని బీఎల్‌వోలను సూచించారు. వాటితో పాటు పీఎస్ఈ, డీఎస్ఈ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మూడవరోజు ఆడుదాం ఆంధ్రా క్రీడలు



ఖో-ఖో పోటీల్లో పాల్గొన్న బాలికలు



నరసరావుపేటలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు



నరసరావుపేటలో క్రికెట్ ఆటను పర్యవేక్షిస్తున్న ప్రతినిధులు, తిలకిస్తున్నయువకులు



గణపవరం సీఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న బాలురు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న యువత

నరసరావుపేట: నియోజకవర్గంలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడలు గురువారం మూడవరోజు ఉత్సాహభరితంగా సాగాయి. పురపాలక పరిధిలోని 28 సచివాలయాల పరిధిలో క్రీడలు ఏర్పాటు చేయగా, ఐదు సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియం, ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్రీడల్లో పోటీపడ్డారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ ఆటలు ఆడారు. డీఎస్ఏ స్టేడియంలో మూడు, ఐదు, ఆరు వార్డులకు చెందిన మూడు జట్ల క్రీడాకారులు మూడు గేమ్‌ల క్రికెట్ ఆడగా, ఒకటీ, రెండు వార్డులకు చెందిన రెండు టీంలు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. పురపాలక పరిధిలో మొత్తం 6826 మంది క్రీడాకారులు వివిధ ఆటలు ఆడేందుకు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వారిలో పురుషులు 3774 మంది ఉండగా మహిళలు 3052 మంది ఉన్నారు. సచివాలయాలకు చెందిన అడ్మిన్ సెక్రెటరీలు క్రీడలను పర్యవేక్షించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో గురువారం ఆహ్లాదకర వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర ఆటలు నిర్వహించారు. అలవాల, అన్నవరం, ఆరేపల్లి, బుచ్చిబాపన్నపాలెం, గోగులపాడు, కర్లకుంట, కొత్తపల్లి, మాచవరం, నల్లగార్లపాడు, రొంపిచర్ల, తెరిమెళ్ల, వడ్లమూడివారిపాలెం, వీరవట్నం, విప్పర్లపల్లి సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహించారు. ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు ఆటలను పర్యవేక్షించగా, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది క్రీడలను నిర్వహించారు.

నాండెల్లో...

నాదెండ్ల: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలోని 16 సచివాలయాల్లో గురువారం మూడో రోజు హోరాహోరీగా జరిగాయి. మూడో రోజు 17 టీములు తలపడ్డాయి. గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో షటిల్ పోటీలు నిర్వహించారు. ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ పోటీల్లో బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు జరగ్గా ఐదు టీంలు ఎంపికయ్యాయి. పోటీలను పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



వైభవంగా ధనుర్మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంకాలమ్మపేటలో అంకాలమ్మ తల్లి దేవస్థానం నుంచి ఏనుగుపాలెం రంగనాయకస్వామి గుడి వద్దకు ఏడీబీ బ్యాంక్ వీధి అమ్మవారి దేవస్థానం వరకు మహిళా భక్తులు స్వామివారి ఉత్సవ మూర్తులతో ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

డాక్టర్ గోపిరెడ్డి హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

స్పష్టం చేసిన నాయకులు



మాట్లాడుతున్న పొడా ఛైర్మన్ మిట్టపల్లి

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో కొనసాగుతూ ప్రజల ఆదరాభిమానాలతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తమ నాయకుడని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. వచ్చే 2024 ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయం అందజేస్తామని స్పష్టం చేశారు. కొంతమంది నాయకులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా బుధవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయం ముందు ప్రదర్శన చేయటంపై పలు పత్రికలు, చానళ్లలో వచ్చిన వార్తలకు వ్యతిరేకంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు సమావేశమై ఎమ్మెల్యే గోపిరెడ్డికి మద్దతుగా విలేకర్లతో మాట్లాడారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ నంబరు ఒన్‌గా ఉన్న ప్రాక్టీసు పక్కన పెట్టి 2011 నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2014, 2019 ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ జిల్లాలోని ఎమ్మెల్యేలు పోటీ పడినా నరసరావుపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించారన్నారు. రూ.170 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల నిర్మాణం చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో ఆయనచేసిన కృషి ఎవరూ మర్చిపోలేనిదన్నారు. 200 పడకల వైద్యశాలలో కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయించారని, 15వేల మందికి ఇళ్లపట్టాలు ఇప్పించారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే గోపిరెడ్డిని సీఎం జగన్ ఆశీస్సులతో మూడోసారి పోటీచేయించి హ్యాట్రిక్ విజయం సాధించి సీఎం జగన్‌కు బహుమానం అందజేస్తామన్నారు. మాట్లాడిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ముదిరాజు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, రొంపిచర్ల ఎంపీపీ గడ్డం వెంకటరావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ బత్తుల రామకృష్ణ, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు గానుగపంట ఉత్తమరెడ్డి, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఎన్‌కే ఆంజనేయులు, చినతురకపాలెం నాయకుడు పొదిలే ఖాజా, సొసైటి అధ్యక్షులు వట్టికొండ ఆంజనేయులు, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాదర్‌బాష ఉన్నారు.

వంగవీటి రంగాను హత్య చేయించింది చంద్రబాబే

- జనసేనకు ఇది తెలియకపోవడం ఆశ్చర్యకరం!
- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న మున్సిపల్‌చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: దివంగత వంగవీటి మోహనరంగాను హత్యచేయించింది చంద్రబాబేనన్నది జగమెరిగిన సత్యమని... ఇదే విషయాన్ని రంగా వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడితే జనసేన నాయకుడికి ఎందుకు బాధ కలిగిందని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడుపై జనసేన నాయకుడు తోట రాజా రమేష్ విమర్శలకు దిగడం పట్ల వారు తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తోట రాజా రమేష్‌కు వంగవీటి మోహనరంగాను ఎవరు హత్య చేయించారో తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం కాపు సామాజిక వర్గానికి చెందిన మల్లెల రాజేష్ నాయుడును సమన్వయకర్తగా నియమించటం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఓర్చుకోలేక తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభిమాన నటుడి సినిమాల కు ఫ్లెక్సీలు కట్టేందుకు చందాలు వసూలు చేస్తూ, బ్లాక్‌లో టికెట్లు అమ్ముకొనే వారు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తను విమర్శించే స్థాయి లేదన్న విషయం గుర్తుంచుకోవాలని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు యాదల సుజాత, నాయకులు బండారు జయకుమార్, బేరింగ్ మౌలాలి, కౌన్సిలర్లు చెమిటిగంటి పార్వతి, తులం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ ద్వారా రూ. 3 కోట్ల రుణాలు మంజూరు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్



శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో ఇప్పటి వరకు 229 మంది లబ్ధిదారులకు రూ. 3 కోట్ల 28 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ తెలిపారు. గురువారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మేనేజరు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగి ఉన్న పాడి పోషకులదారులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు రుణాలు తక్కువ వడ్డీ రేటుకు ఇస్తున్నట్లు వెల్లడించారు. అలాగే జగనన్న తోడు పథకంలో చిరువ్యాపారులకు 295 మంది లబ్ధిదారులకు రూ. 18 లక్షల రుణాలను మంజూరు చేశామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వం వడ్డీరాయితీ కూడా కల్పించినట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు 300 గ్రూపులకు రూ.35 కోట్లు రుణాలు అందజేశామన్నారు. రుణాలు రీకవరీ బాగానే ఉందన్నారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాతాదారుల సహకారంతో శావల్యాపురం బ్యాంకుశాఖ ఆర్థిక లావాదేవీలో ముందుంజలో ఉందన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ గుబ్బల సధీర్‌బాబు, నివ్య బ్యాంకు సిబ్బంది రామిరెడ్డి ఉన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



గణపవరంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాదెండ్ల: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్ఐ షేక్ రమీజా చెప్పారు. గణపవరంలోని బొడ్డురాయిసెంటర్, జాతీయ రహదారి పక్కన టీస్టెప్ వద్ద ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం ద్వారా ప్రజలు ఎలా ఓటు వినియోగించుకోవాలో వివరించారు. ఈవీఎంల పనితీరును వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29న ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నావారిపాలెం, 30న తూబాడు, చందవరంలో, జనవరి 2న సాతులూరు, గొరిజవోలులో, 3న సంకురాత్రిపాడు, జంగాలపల్లెలో, 4న కనపర్రు, మైనంపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, ఇర్లపాడులో, 5న అప్పాపురంలో ఈవీఎంలపై అవగాహన కల్పించనున్నారు. ఈవీఎం కీబోర్డులో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన సమయంలో పక్కనే ఉన్న వీవీపాట్ మిషన్ స్క్రీన్‌లో పేరు కనిపిస్తుందని తెలిపారు. వీఆర్వోలు వీరయ్య, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు కవిత, జ్యోతిర్మయి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రవ్వవరం గ్రామంలో..

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పుచ్చనూతల గ్రామపంచాయతీ పరిధిలోని రవ్వవరం గ్రామంలో గల సచివాలయంలో ఓటర్లకు ఈవీఎం మిషన్లు పనిచేయు విధానంపై ఓటర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానం, ఈవీఎం మిషన్లు పనిచేయు విధానంపై వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో పద్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్లపై ఓటర్లకు అవగాహన

బొల్లాపల్లి: ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు సూచించారు. మండలంలోని వెల్లటూరు, గుట్లపల్లి, కనుమలచెరువు సచివాలయాల్లో ఈవీఎం మిషన్లపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల పనితీరును వివరించారు. జనవరి 5 నుంచి 22 వరకు ఓటర్ల జాబితా సవరణ చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఓటర్లు తమ ఓట హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఈవీఎం ద్వారా ఓటు ఏవిధంగా వేయాలో గ్రామస్తులు చూపించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఎం. నరసింహారావు, కె. జ్యోతి సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.